అండర్‌పాస్ నిర్మాణం కోసం 20న ధర్నా

● గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు నర్సింహ

వీరవెల్లిలో సంతకాల సేకరణ చేపడుతున్న అండర్‌పాస్ నిర్మాణ సాధన కమిటీ సభ్యులు

భువనగిరి కలెక్టరేట్, జనవరి 17 : పట్టణంలోని బైపాస్ రోడ్డులో ప్రభుత్వ ఐటీఐ దగ్గర జాతీయ రహదారిపై అండర్ పాస్ నిర్మాణం చేపట్టాలని ఈ నెల 20న కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం జిల్లా అధ్యక్షుడు దయ్యాల నర్సింహ అన్నారు. ధర్నాను విజయవంతం చేయాలని కోరుతూ మండలంలోని వీరవెల్లిలో శుక్రవారం సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేషనల్ హైవేపై అండర్‌పాస్ నిర్మాణం లేకపోవడంతో అనేక మంది ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి అండర్ పాస్ నిర్మాణం చేపట్టి ప్రమాదాలను అరికట్టాలని కోరారు. 2010 నుంచి 2024 వరకు రోడ్డు దాటుతూ ప్రమాదాలకు గురై మరణించిన ప్రతి కుటుంబానికి రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని, ప్రమాదంలో గాయపడి వికలాంగులైన వారికి నష్టపరిహారం, నెలవారీ పింఛన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పల్లెర్ల అంజయ్య, అండర్ పాస్ నిర్మాణ సాధన కమిటీ కన్వీనర్ సిలువేరు ఎల్లయ్య, కో కన్వీనర్ మందాడి సిద్ధారెడ్డి, నాయకులు కంచి మల్లయ్య, భువనగిరి రాములు, భిక్షపతి, పాండు, శేఖర్‌రెడ్డి, పారిజాత, ఆకిటి వెంకట్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ కంచి లలిత, చంద్రమౌళి, పుష్ప, కొండె కృష్ణ, రేగు రవి పాల్గొన్నారు.

వృత్తిలో నైపుణ్యం పెంపొందించుకోవాలి : కిశోర్‌రెడ్డి

విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తున్న రామానంద తీర్థ సంస్థ చైర్మన్ కిశోర్‌రెడ్డి

భూదాన్ పోచంపల్లి, జనవరి 17 : విద్యార్థులు వృత్తి విద్యలో నైపుణ్యం పెంపొందించుకోవాలని స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థ చైర్మన్ ఎన్.కిశోర్ రెడ్డి అన్నారు. మండలంలోని జలాల్‌పూర్ గ్రామంలో గల స్వామి రామానంద తీర్థ గ్రామీణ సంస్థలో రిమిని స్ట్రీట్ ఇండియా ఆపరేషన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సహకారంతో నిర్వహించిన బేసిక్ బ్యూటీషియన్ కోర్స్, సెల్ఫ్ ఎంప్లాయ్‌మెంట్ టైలరింగ్‌లో శిక్షణ పొందిన విద్యార్థులకు శుక్రవారం సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించాలన్నారు. కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ పీఎస్ఎస్ఆర్ లక్ష్మి, శిక్షణ అధికారి విహారి కృష్ణ, లలిత, విజయలక్ష్మి, రిమిని స్ట్రీట్ కంపెనీ ప్రతినిధులు సూర్యనారాయణ రాజు, పద్మజ, రాజేశ్వర్ పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో రూ.150కోట్లతో అభివృద్ధి పనులు చేశాం

● మున్సిపల్ చైర్మన్ రాజు

సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ రాజు

చౌటుప్పల్, జనవరి 17 : చౌటుప్పల్‌ను మోడల్ మున్సిపాలిటీగా తీర్చిదిద్దేందుకు ప్రభుత్వం నుంచి మంజూరైన రూ.150 కోట్లతో ఐదు ఏండ్లలో పలు అభివృద్ధి పనులు చేపట్టామని మున్సిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు అన్నారు. పట్టణంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి సహకారంతో పలు అభివృద్ధి పనులు చేపట్టామన్నారు. మున్సిపల్ నిధులు రూ.55కోట్లు, ఇతర నిధులు రూ.45కోట్లతో రోడ్ల నిర్మాణాలు చేశామని తెలిపారు. మంచి నీటి సమస్య పరిష్కారానికి నాలుగు వాటర్ ట్యాంకుల పనులు ప్రారంభించినట్లు తెలిపారు. తంగడపల్లి రోడ్డు విస్తరణ పూర్తి చేశామని, లైటింగ్ ఏర్పాటు చేయాల్సి ఉందని అన్నారు.

'రజకులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి'

సభ్యత్వ నమోదు చేపడుతున్న వెంకటేశ్

మోటకొండూర్, జనవరి 17 : రజకులకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని రజక వృత్తిదారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్డెబోయిన వెంకటేశ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మండల కేంద్రంలో శుక్రవారం సంఘం సభ్యత్వ నమోదు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికలకు ముందు బీసీ డిక్లరేషన్‌లో రజకులకు అనేక హామీలు ఇచ్చిందని, వాటిని వెంటనే అమలు చేయాలని అన్నారు. ఇందిరమ్మ ఇండ్ల పథకంలో ఇల్లు లేని రజకులకు మొదటి ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. రాబోయే బడ్జెట్లో రజక వృత్తిదారుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వడ్డమాను బాలరాజు, నాయకులు వడ్డెబోయిన జహంగీర్, వడ్డెబోయిన శ్రీరాములు, మరి కుక్కల మహేశ్, జంగవెల్లి రాజశేఖర్, వడ్డెబోయిన నాగరాజు, జంగవెల్లి నరేశ్, యాదయ్య, సురేశ్, శ్రీను, జహంగీర్ పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు మోత్కూరు విద్యార్థులు

జి.నిఖిత

జి.వర్షిణి

మోత్కూరు, జనవరి 17 : మండలంలోని సెక్రేడ్ హార్ట్ ఇంగ్లిషు మీడియం ఉన్నత పాఠశాల విద్యార్థులు ఫుట్‌బాల్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని పాఠశాల ప్రిన్సిపాల్ టి.తానయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నల్లగొండ జిల్లా కేంద్రంలో జరిగిన రాష్ట్ర స్థాయి పోటీల్లో పాఠశాలకు చెందిన జి.వర్షిణి, జి.నిఖిత ప్రతిభ కనిబరిచారని పేర్కొన్నారు. వీరు ఒడిశాలో శనివారం నుంచి జరిగే జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. విద్యార్థులను ఫుట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.మహేశ్, కృష్ణకుమార్, యాదయ్య అభినందించారు.

మనస్తాపంతో యువకుడి ఆత్మహత్య

ఆలేరు టౌన్, జనవరి 17 : ఆలేరుకు చెందిన పర్వతం సాయికుమార్ (20) ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఎస్ఐ కె.రజనీకాంత్ వివరాల ప్రకారం.. పట్టణంలోని బీసీ కాలనీలో తల్లిదండ్రులతో కలిసి ఉంటున్న సాయికుమార్ ఏం పని చేయకుండా తిరుగుతున్నాడు. ఏదైనా పని చేసుకోవాలని తల్లిదండ్రులు మందలించారు. దాంతో మనస్తాపానికి గురైన సాయికుమార్ శుక్రవారం మధ్యాహ్నం బీసీ కాలనీ సమీపంలోని ఒక వెంచర్‌లోకి వెళ్లి చెట్టుకు ఉరి వేసుకున్నాడు. రాత్రి అయినా ఇంటికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెతుకగా వెంచర్‌లో ఉరివేసుకొని ఉన్నాడు. సాయికుమార్ తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ తెలిపారు.

24న సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం

రామన్నపేట, జనవరి 17 : సర్దార్ సర్వాయి పాపన్న గీత కార్మిక సంఘం జిల్లా కమిటీ సమావేశం ఈ నెల 24న భువనగిరిలో నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు కప్పల రవికుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. సమావేశానికి గౌడ సోదరులు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

అర్హులందరికీ రైతు భరోసా అందేలా చూడాలి

● కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్టలో రైతు భరోసా సర్వేను క్షేత్రస్థాయి పరిశీలన చేస్తున్న కలెక్టర్ హనుమంతరావు

యాదగిరిగుట్ట, జనవరి 17 : అర్హులైన రైతులందరికీ రైతు భరోసా వచ్చే విధంగా సర్వే చేపట్టాలని కలెక్టర్ హనుమంతరావు అన్నారు. పట్టణంలోని యాదగిరిపల్లిలో రైతు భరోసా సర్వేను శుక్రవారం క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. సర్వేలో వ్యవసాయాధికారులు చేపడుతున్న విధానాన్ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అధికారులకు పలు సూచనలు చేశారు. సాగుకు యోగ్యంకాని భూములను రైతు భరోసా జాబితా నుంచి తొలగించాలన్నారు. సాగు చేసుకుంటున్న వ్యవసాయ భూమిని కచ్చితంగా జాబితాలో ఉంచాలని సూచించారు. అర్హులైన రైతులకు రైతు భరోసా మంజూరు చేస్తామన్నారు. కార్యక్రమంలో తాసీల్దార్ దేశ్యా, ఏఓ సుధారాణి, ఏఈఓ విరన్‌కుమార్ పాల్గొన్నారు.

అనంతారంలో సర్వే పరిశీలన

భువనగిరి కలెక్టరేట్ : మండలంలోని అనంతారం గ్రామంలో రైతు భరోసా, రేషన్ కార్డుల సర్వే ప్రక్రియను కలెక్టర్ శుక్రవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా సర్వే నంబర్లలో పట్టా భూములను, అసైన్డ్ స్థలాలను పరిశీలించి సంబంధిత అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఫీల్డ్ వెరిఫికేషన్‌లో తప్పిదాలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా లబ్ధిదారుల జాబితాను రూపొందించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆయన వెంట ఎంపీడీఓ శ్రీనివాస్, సంబంధిత అధికారులు ఉన్నారు.

బీబీనగర్ : మండల కేంద్రంలో రైతు భరోసా, రేషన్ కార్డుల జారీ ప్రక్రియను కలెక్టర్ హనుమంతరావు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఆయా సర్వే నంబర్లలో గల రైతులకు సంబంధించిన పట్టా భూములను, అసైన్డ్ స్థలాలను పరిశీలించి అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ భూమి దగ్గరకు వెళ్లి రైతు నుంచి వివరాలు సేకరించారు. ఆయన వెంట తాసీల్దార్ శ్రీధర్, ఎంపీడీఓ శ్రీనివాస్‌రెడ్డి, ఆర్ఐ వెంకట్‌రెడ్డి, ఏఓ పద్మ, పంచాయతీ కార్యదర్శి జాకీర్ ఉన్నారు.

స్వాతంత్ర్య సమరయోధుడు నారాయణరెడ్డి మృతి

రాజాపేట, జనవరి 17 : మండలంలోని పాముకుంట గ్రామానికి చెందిన స్వాతంత్ర్య సమరయోధుడు ఎడ్ల నారాయణరెడ్డి (94) అనారోగ్యంతో గురువారం మృతి చెందారు. ఆయన మృతదేహంపై పలువురు నాయకులు, గ్రామస్తులు పూలమాలలు వేసి నివాళి అర్పించారు. మండలంలోని కుర్రారంలో ఆయన అంత్యక్రియలు నిర్వహించారు.

బైక్‌ను ఢీకొట్టిన లారీ

● రైల్వే కీ మెన్ దుర్మరణం

భువనగిరి కలెక్టరేట్, జనవరి 17 : లారీ వెనుక నుంచి ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న వ్యక్తి తీవ్రగాయాలపాలై మృతి చెందాడు. ఈ సంఘటన మండలంలోని అనాజీపురం గ్రామ సమీపంలో శుక్రవారం జరిగింది. భువనగిరి రూరల్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. వలిగొండ మండలం వెల్వర్తి గ్రామానికి చెందిన బూడిద యాదగిరి (50) రైల్వేలో కీ మెన్‌గా విధులు నిర్వర్తిస్తున్నాడు. శుక్రవారం ఉదయం ఇంటి నుంచి తన ద్విచక్ర వాహనంపై మండలంలోని పగిడిపల్లి గ్రామంలో గల ఆఫీసుకు వెళ్తుండగా అనాజీపురం స్టేజీ వద్ద వెనుక నుంచి అతివేగంగా, అజాగ్రత్తతో వచ్చిన లారీ ఢీకొట్టింది. దాంతో తీవ్ర గాయాలైన యాదగిరిని చికిత్స నిమిత్తం భువనగిరి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో మెరుగైన వైద్యం కోసం లాలాగూడ రైల్వే ఆసుపత్రికి తీసుకెళ్లగా.. అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. మృతుడి బావ మహేశ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు రూరల్ సీఐ వి.సంతోష్‌కుమార్ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం

భూదాన్ పోచంపల్లి, జనవరి 17 : పని నిమిత్తం బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమయ్యాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని కనుముక్కుల గ్రామానికి చెందిన చుక్క ఎల్లయ్య (60) కుటుంబ సభ్యులతో కలిసి మన్సూరాబాద్ సాయి సప్తగిరి కాలనీలో ఉంటున్నాడు. ఈ నెల 12న పని నిమిత్తం బయటికి వెళ్లిన ఎల్లయ్య సాయంత్రం వరకు తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు బంధువులు, చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఎల్బీనగర్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. పోలీసులు దర్యాప్తు చేపడుతున్నారు. ఎల్లయ్య బయటకు వెళ్లిన సమయంలో పింక్ కలర్ చొక్కా, బ్లూ కలర్ ప్యాంట్ ధరించి ఉన్నాడని, ఆచూకీ తెలిసినవారు 9948344666, 86883386 87లలో సంప్రదించాలని కోరారు. ఎల్లయ్య ఆచూకీ తెలిపిన వారికి పారితోషికం ఇవ్వనున్నట్లు కుటుంబ సభ్యులు ప్రకటించారు.

వ్యక్తి ఆత్మహత్య

రాజాపేట, జనవరి 17 : మండలంలోని రఘునాథపురంలో కుటుంబ కలహాలతో మద్యానికి బానిసై ఓ వ్యక్తి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. రఘునాథపురం గ్రామానికి చెందిన బొంత వెంకటేశ్(35) దినసరి కూలీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, కుటుంబ కలహాలతో భార్య తమ ఇద్దరు పిల్లలను తీసుకొని పుట్టింటికి వెళ్లిపోయింది. దాంతో వెంకటేశ్ మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో జీవితం మీద విరక్తి చెంది శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహానికి ఆలేరు ప్రభుత్వ దవాఖానలో పోస్టుమార్టం నిర్వహించిన అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

మదర్ డెయిరీ మనుగడ కోసమే ఆస్తుల అమ్మకం

● చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

సమావేశంలో మాట్లాడుతున్న మదర్ డెయిరీ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి

యాదాద్రి భువనగిరి, జనవరి 17 (నమస్తే తెలంగాణ) : మదర్ డెయిరీ మనుగడ కోసమే ఆస్తులు అమ్మాలని నిర్ణయించామని, త్వరలో జరిగే జనరల్‌బాడీ సమావేశంలో ఈ మేరకు చర్చించి తీర్మానం చేస్తామని డెయిరీ చైర్మన్ గుడిపాటి మధుసూదన్‌రెడ్డి అన్నారు. భువనగిరిలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ ప్రాంతాల్లో ఆస్తులను అమ్మి, యూనియన్‌కు ఉన్న అప్పులు చెల్లించి.. డెయిరీని నడుపుతామని తెలిపారు. త్వరలో ఓపెన్ బిడ్, యాక్షన్ ప్రకటిస్తామని, పారదర్శకంగా భూములను అమ్ముతామని అన్నారు. మదర్ డెయిరీ చట్టాల ప్రకారం డెయిరీకి ప్రభుత్వం నుంచి గ్రాంట్ ఇచ్చే రూల్ లేదని తెలిపారు. డెయిరీ పరిధిలో 250 మందిని పర్మినెంట్ చేశారని, 180 మందికి పదోన్నతులు కల్పించారని, దీని వల్ల యూనియన్‌పై ఏటా రూ.2కోట్ల అదనపు ఆర్థిక భారం పడిందని చెప్పారు. 45 రోజుల పాల బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. గతంలో రెండు ఆడిట్లను తయారు చేశారని, గత పాలకవర్గ సభ్యులు లాభాలను మాత్రమే చూపించారని, నష్టాలను దాచారని ఆరోపించారు. దీనిపై అవసరమైతే త్వరలో ఏసీబీకి వివరాలు అందజేస్తామన్నారు. యాదగిరిగుట్టకు మదర్ డెయిరీ నెయ్యి సరఫరా నిలిచిపోతే నెలకు రూ.1.5 కోట్ల బిల్లులు తగ్గిపోతాయని చెప్పారు. సమావేశంలో మదర్ డెయిరీ డైరెక్టర్లు గొల్లపల్లి రామిరెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, నర్సింహులు, శ్రీశైలం పాల్గొన్నారు.

మోత్కూరు పోస్టాఫీసులో ఆధార్ సేవలు ప్రారంభం

ఆధార్ సేవలను పరిశీలిస్తున్న సబ్ పోస్ట్ మాస్టర్ రమేశ్

మోత్కూరు, జనవరి 17 : మున్సిపాలిటీలోని సబ్ పోస్టాఫీసులో ఆధార్ కేంద్రాన్ని సబ్ పోస్ట్ మాస్టర్ రచ్చ రమేశ్ శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధార్ సవరణలు, చిన్న పిల్లలవి కొత్తవి, ఐదు సంవత్సరాలు పైబడిన పిల్లల ఫొటో, వేలిముద్రల నమోదు కోసం ఈ సెంటర్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. 10 సంవత్సరాల్లోపు ఆడ పిల్లలకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకం, పది సంవత్సరాలు పైబడిన ఆడ, మగ పిల్లల కోసం పబ్లిక్ ప్రావిడెంట్ ఫండ్ పథకాలలో చేరడానికి ప్రతి ఒక్కరికీ ఆధార్ కార్డు తప్పనిసరిగా అవసరం ఉందన్నారు. వేలిముద్రలు రాని ఆసరా లబ్ధిదారులు ఆధార్ రీ ఎన్‌రోల్ చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పోస్టల్ అసిస్టెంట్ అరుణకుమారి, ఆధార్ ఆపరేటర్ మహేశ్వరి పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో మహిళ ప్రసవం.. తల్లీబిడ్డ క్షేమం

108 అంబులెన్స్‌లో జన్మించిన మగ శిశువుతో ఈఎంటీ ప్రవీణ్

గుండాల, జనవరి 17 : మండలంలోని పెద్దపడిశాల గ్రామానికి చెందిన మహిళ శుక్రవారం 108 వాహనంలో ప్రసవించింది. 108 అంబులెన్స్ ఈఎంటీ ప్రవీణ్, పైలట్ సోమేశ్వర్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపడిశాల గ్రామానికి చెందిన లగ్గాల మనితకు శుక్రవారం పురిటి నొప్పులు రావడంతో 108కు ఫోన్ చేశారు. వెంటనే వచ్చిన 108 సిబ్బంది మహిళను జనగామకు తరలిస్తుండగా.. నొప్పులు అధికమై మార్గమధ్యలో దేవరుప్పల మండలం సీతారాంపురం వద్ద మగబిడ్డకు జన్మనిచ్చింది. తల్లీబిడ్డ క్షేమంగా ఉన్నారని, వారిని జనగామ మాతా శిశు సంరక్షణ కేంద్రానికి తరలించామని 108 సిబ్బంది తెలిపారు. సమయస్ఫూర్తితో చికిత్స అందించిన ప్రవీణ్‌ను పలువురు అభినందించారు.

కొండగడపలో విషాదఛాయలు

● గ్రామానికి చేరిన ఒకే కుటుంబానికి చెందిన నలుగురి మృతదేహాలు

కొండగడపలో మృతదేహాల వద్ద విలపిస్తున్న బంధువులు, గ్రామస్తులు

మోత్కూరు, జనవరి 17 : మహారాష్ట్ర లోని షిరిడీ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలంలోని కొండగడప గ్రామానికి చెందిన శ్యాంశెట్టి ప్రేమలత, ఆమె కుమార్తె ప్రసన్నలక్ష్మి, మనుమరాలు అక్షిత, ఆరు నెలల మనుమడు వైద్విత్ మృతి చెందిన విషయం తెలిసిందే. వారి మృతదేహాలను శుక్రవారం స్వగ్రామానికి తీసుకొచ్చారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందడంతో గ్రామంలో తీవ్ర విషాదఛాయలు అలుముకున్నాయి. అందరితో కలుపుగోలుగా చేదోడుగా ఉండే శ్యాంశెట్టి కృష్ణమూర్తి కుటుంబంలో విషాదం చోటు చేసుకోవడంతో బంధువులు, గ్రామస్తులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతదేహాలకు పలువురు సంతాపం తెలిపారు. శనివారం అంత్యక్రియలు నిర్వహించనున్నట్లు కృష్ణమూర్తి సోదరుడు రమేశ్ తెలిపారు. కాగా, ప్రమాదంలో గాయపడిన అదే కుటుంబానికి చెందిన మరో నలుగురిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు.

'ఉద్యమకారుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి'

సమావేశంలో మాట్లాడుతున్న తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడు శ్రీనివాస్‌గౌడ్

బీబీనగర్, జనవరి 17 : మానుకోటలో ఈ నెల 19న జరుగనున్న తెలంగాణ ఉద్యమకారుల ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం మండలాధ్యక్షుడు పంజాల శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యమకారులకు 250 గజాల ఇంటి స్థలం ఇస్తామని చెప్పిందన్నారు. ఇచ్చిన హామీని నెరవేర్చాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర అధికార ప్రతినిధి చంద్రభానునాయక్, జిల్లా అధికార ప్రతినిధి సోమారం శంకర్, బాదిని రాముగౌడ్, ఎండీ మున్నా పాల్గొన్నారు.

బేటీ బచావో బేటీ పడావోను విజయవంతం చేయాలి

● అదనపు కలెక్టర్ గంగాధర్

సమావేశంలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ గంగాధర్

భువనగిరి కలెక్టరేట్, జనవరి 17 : బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమంపై అన్ని శాఖల జిల్లా అధికారులు సమన్వయంతో పనిచేసి విజయవంతం చేయాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అన్నారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో వివిధ శాఖల అధికారులతో శుక్రవారం సాయంత్రం ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. గిరిజన తండాల్లో 18ఏండ్ల లోపు బాలికలు, కొత్తగా పెండ్లి అయిన మహిళలకు అర్థమయ్యేలా కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. పనులకు వెళ్తున్న పిల్లలను గుర్తించి బడుల్లో చేర్పించాలని సూచించారు. అన్ని శాఖల అధికారులు బృందాలుగా ఏర్పడి ఆపదలో, పనుల్లో ఉన్న బాలలను రక్షించి కనీస సౌకర్యాలు సమకూర్చాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా బాలల సంక్షేమ సమితి చైర్మన్ బండారు జయశ్రీ, సభ్యులు పి.రుద్రమదేవి, శివరాజు, మల్లేశం, డీఆర్డీఓ నాగిరెడ్డి, డిప్యూటీ డీఎంహెచ్ఓ యశోద, ఉపాధి కల్పనాధికారి సాహితి, జిల్లా క్రీడలు, యువజన అధికారి ధనుంజనేయులు, డీఈఓ సత్యనారాయణ, డీపీఓ సునంద, జిల్లా సంక్షేమ అధికారి నరసింహారావు పాల్గొన్నారు.

సర్వేను పకడ్బందీగా చేపట్టాలి : అదనపు కలెక్టర్

సంస్థాన్ నారాయణపురం : అధికారులకు సూచనలు చేస్తున్న అదనపు కలెక్టర్ వీరారెడ్డి

సంస్థాన్ నారాయణపురం, జనవరి 17 : రేషన్ కార్డులు, రైతు భరోసా సర్వే ప్రక్రియను పకడ్బందీగా చేపట్టాలని అదనపు కలెక్టర్ వీరారెడ్డి అధికారులకు సూచించారు. మండలంలోని గుడిమల్కాపురం, రాచకొండ గ్రామాల్లో రేషన్ కార్డులు, రైతు భరోసా సర్వే ప్రక్రియను శుక్రవారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. సాగు చేయకుండా ప్లాట్లు, వెంచర్లు, కంపెనీలు ఉన్న భూములను గుర్తించాలని అధికారులకు సూచించారు. మండల ప్రత్యేకాధికారి జయశ్రీ, తాసీల్దార్ కృష్ణ, ఎంపీడీఓ ప్రమోద్‌కుమార్, ఎంపీఓ నర్సింహ, ఏఓ వర్షిత రెడ్డి, ఏపీఓ ప్రశాంతి పాల్గొన్నారు.

సర్వేను పారదర్శకంగా నిర్వహించాలి

రామన్నపేట : ఈ నెల 26నుంచి కొత్తగా అమలు చేయనున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా లబ్ధిదారుల సర్వేను పారదర్శకంగా నిర్వహించాలని అదనపు కలెక్టర్ గంగాధర్ అధికారులకు సూచించారు. మండలంలోని సిరిపురం గ్రామంలో నిర్వహిస్తున్న సర్వేను శుక్రవారం ఆయన పరిశీలించారు. వివిధ పథకాల కోసం దరఖాస్తు చేసుకున్న వారితో ఆయన మాట్లాడారు. ఆయన వెంట తాసీల్దార్ లాల్‌బహదూర్, ఎంపీడీఓ యాకూబ్‌నాయక్, ఎంపీఓ రవూఫ్ అలీ, ఏపీఓ వెంకన్న, పంచాయతీ కార్యదర్శి జ్యోతి ఉన్నారు.

రైతు భరోసా సర్వే రికార్డుల పరిశీలన

మోటకొండూర్ : రైతు భరోసా సర్వేను పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ కృష్ణారెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. తాసీల్దార్ కార్యాలయంలో రైతు భరోసా సర్వే రికార్డులను శుక్రవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతు భరోసాలో అర్హులను గుర్తించి అనర్హులను తొలగించాలన్నారు. సాగుకు యోగ్యమైన భూములకు మాత్రమే రైతు భరోసా వచ్చేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. తాసీల్దార్ శాంతిలాల్, ఏఈఓలు శివానీ, సంధ్య పాల్గొన్నారు.

సాగుకు పనికిరాని భూములకు రైతుభరోసా వర్తించదు

ఆత్మకూరు(ఎం) : ప్రభుత్వం రైతుల కోసం ప్రవేశపెట్టిన రైతు భరోసా పథకం సాగుకు పనికిరాని భూములకు వర్తించదని డివిజన్ అడ్మినిస్ట్రేషన్ అధికారి లావణ్య అన్నారు. తాసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వ్యవసాయ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడారు. రైతు భరోసా కోసం సాగుకు అనువైన భూములతోపాటు సాగు చేస్తున్న భూముల వివరాలను నమోదు చేసి పై అధికారులకు అందజేయాలన్నారు. మండలంలో సుమారు వెయ్యి ఎకరాల వరకు సాగుకు అనుకూలంగా లేని భూములు ఉన్నాయన్నారు. అనంతరం వివిధ గ్రామాల్లో చేపట్టిన రైతు భరోసా సర్వేను పరిశీలించారు. తాసీల్దార్ రవికుమార్, డీటీ సఫియొద్దీన్, ఆర్ఐ వెంకటేశ్వర్లు, ఏఓ అపర్ణ, ఏఈఓలు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇండ్ల సర్వే పరిశీలన

ఆలేరు రూరల్ : మండలంలోని కొలనుపాకలో ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా సర్వేను జడ్పీ సీఈఓ శోభారాణి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తప్పులు లేకుండా పకడ్బందీగా సర్వే నిర్వహించాలని అధికారులకు సూచించారు. ఆమె వెంట ఎంపీడీఓ సత్యాంజనేయ ప్రసాద్,